విజయంపై వైఎస్సార్ సీపీ ధీమా

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలో విజయంపై వైఎస్సార్ సీపీ ధీమాగా ఉంది. ఈ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 87.752 శాతం పోలింగ్ నమోదైంది. భారీ పోలింగ్ తమ విజయానికి సూచనగా వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొంటున్నారు. మహిళలు ముఖ్యంగా వృద్ధులు, 40 సంవత్సరాలు దాటిన మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ బూత్‌లకు తరలిరావడం సంక్షేమ పథకాలను మద్దతు తెలపడమేనని విశ్లేషిస్తున్నారు. గతెన్నికల్లోనూ 85 శాతం పైబడి పోలింగ్ నమోదుకాగా వైఎస్సార్ సీపీ నుంచి పుప్పాల వాసుబాబు దాదాపు 35 వేల రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించారు. ఇప్పుడా దిశగానే ఉంటుందని, మెజార్టీ తగ్గే అవకాశం ఉందని లెక్కలేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1.04 లక్షల మంది మహిళా ఓటర్లు ఉండగా వీరిలో 90,670 మంది మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో అధికశాతం మంది సంక్షేమ పథకాల లబ్ధిదారులు, జగనన్నకాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందినవారేనని చెబుతున్నారు. జనసేన అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజుకు ఒక సామాజికవర్గం ఓట్లు గంపగుత్తగా పడతాయని ఆశించినా ఆమేరకు జరగలేదని, ఆ వర్గంలో సగానికి పైగాఓట్లు ఫ్యాన్ గుర్తుకు పడ్డాయని ప్రచారం నెలకొంది. యువత, సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులైన మహిళలు, తమకే వేశారని ధర్మరాజు గెలుపు ఖాయమని టీడీపీ, జనసేన నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు సుదీర్ఘ సమయం ఉండటంతో రోజుకోరకమైన అంచనాలు ప్రచారంలోకి వస్తున్నాయి. అభ్యర్థులు విజయాలు, మెజార్టీలపైనా జోరుగా పందాలు సాగుతున్నాయి. మొదట్లో ఒక అభ్యర్థి గెలుపుపై కోసు పందాలు కాసినవారు, ఇప్పుడు ఎందుకైనా మంచిదని తిరగేసి పందాలు కాస్తున్నారని చెబుతున్నారు.


బువ్వనపల్లిలో పోలింగ్ బూత్ వద్ద కిక్కిరిసి ఉన్న ఓటర్లు (ఫైల్)

పథకాలే పట్టం కడతాయి

ఉంగుటూరు: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ పథకాలు తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో లబ్ధిదారులంతా ఓటింగ్‌కు పోటెత్తారు. పోలింగ్ బూత్‌ల ఉదయం నుంచే బారులు తీరారు. పోలింగ్ సమయం ముగిసే నాటికి ఆయా కేంద్రాల్లో ఉన్నవారంతా ఓటేసేందుకు అవకాశం ఇచ్చారు. వీరిలో ఎక్కువగా మహిళలు, వృద్ధులు ఉండటం విశేషం. జగన్ హయాంలో నవరత్న పథకాలు అమలు చేయడం వైఎస్సార్ సీపీకి కలిసి వచ్చే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయని విధంగా సీఎం జగన్ అవినీతి లేకుండా, కుల, మత, ప్రాంత, రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేశారు. పథకాల లబ్ధి నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వంటి అంశాలు ఉంగుటూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు విజయానికి దోహదపడతాయని చెబుతున్నారు. లబ్ధిదారులంతా ఆనందగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోటీ పడ్డారని ప్రచారం నెలకొంది. సామాజిక పింఛనుదారులు ప్రతినెలా ఒకటో తేదీనే తెల్లారేసరికే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే సొమ్ము అందుకునే వారు. గత రెండు నెలలుగా సామాజిక పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ అంశాలన్నీ వైఎస్సార్ సీపీ విజయానికి దోహదం చేసే అంశాలేనని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం


గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయం వరిస్తుందని చెప్పారు. సీఎం జగన్ మోహనరెడ్డి పేద బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. వాటిని తిరిగి పొందేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారని వివరించారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వైఎస్సార్ సీపీవైపే ఉన్నారని తెలిపారు. జనసేన కూటమి ఎన్ని అడ్డదారులు తొక్కి గెలవాలని ప్రయత్నించినప్పటికీ అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. జగనన్న ముఖ్యమంత్రిగా మరోసారి బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని వరికూటి అశోక్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

దెందులూరు: శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుమలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, శాఖాపరమైన నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ శ్రీలత, ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్, తహసీల్దార్ వి.జితేంద్ర, వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్రకుమార్, గొల్ల నాగరాజు, ఎంపీటీసీలు, ఏటి భీమరాజు, అసిస్టెంట్ ఇంజినీర్లు, మండల అధికారులు ఉన్నారు.

ధాన్యం సొమ్ములు విడుదల చేయాలి

ఏలూరు (టూటౌన్) : రబీ ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాల్సిన సమయం రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం బకాయి సొమ్ములు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని లక్ష్యాన్ని నిర్దేశించడం వల్ల కొంత మేరకు ధాన్యం రైతుల వద్దనే ఉండిపోయిందని చెప్పారు. రబీ ధాన్యానికి 21 రోజుల నిబంధనతో నిమిత్తం లేకుండా సొమ్ము చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం


వంక బొత్తప్పగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గిరిజన గ్రామమైన వంక బొత్తప్పగూడెంలో గురువారం సికిల్ సెల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో నలభై సంవత్సరాల లోపు వయసున్న గిరిజనులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామ ప్రజలకు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. రక్తనాళాల సంఖ్య తగ్గడం, తద్వారా రక్తహీనతకు గురవడం, ఎర్ర రక్తకణాలు రెండు రోజులకు మించి బ్రతకవని, సాధారణ వ్యక్తుల్లో ఎర్ర రక్తకణాలు నూట ఇరవైరోజులు వరకూ ఉంటాయన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా రోగిలో రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారడం వలన రక్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని, గుండెకు ఆక్సిజన్ సరఫరా సరిగా అందకపోవడం వలన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసటగా ఉండటం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని, జన్యుపరంగా సంక్రమించే వ్యాధి అని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సుబ్రహ్మణ్యం గ్రామస్తులకు తెలిపారు. సూపర్‌వైజర్ చాన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్బారావు, ఏఎన్‌ఎం పి.జయప్రద, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.విమల, ఆశ వర్కర్ వి.కుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణపవరం: గణపవరం సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. చినరామచంద్రపురం, కెనరా బ్యాంకు వీధుల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పేర్కొన్నారు.

మహిళలే ముందు వరుసలో

జంగారెడ్డిగూడెం: అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కు వినియోగించుకోవడంలో కూడా వారి చైతన్యం చూపించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పురుషుల కంటే అతివలే అధికంగా ముందుకొచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో జూన్ 4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యాల్లో మహిళా శక్తి కీలకం కానుంది. చింతలపూడి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1229 మంది మహిళలు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,73,069 మంది మొత్తం ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,34,295 మంది, మహిళలు 1,38,733 మంది, ఇతరులు 41మంది ఉన్నారు. వీరిలో 1,10,679 మంది పురుషులు, 1,11,908 మంది మహిళలు, 21మంది ఇతరులు ఓటు వేశారు. మొత్తం మీద 2,22,608 మంది తమ ఓటును వినియోగించుకోగా, 81.5 2శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గం నాలుగు మండలాల్లో లింగపాలెం మండలంలో అత్యధికంగా 89.4 శాతం పోలింగ్

విజ్ఞానానికి సోపానాలు గ్రంథాలయాలు


భీమడోలులో చిన్నారులకు నీతి కథలు చెబుతున్న మండే సుధాకర్

భీమడోలు: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రతి విద్యార్థీ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రామాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వేసవి శిక్షణ తరగతులు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని వాటిని చదివి, వాటిపై సమీక్షలు రాశారు. దినపత్రికల ద్వారా తెలుగు పరిజ్ఞానం వృద్ధి చెందుతుందని, వాటిని చదివించారు. మండే సుధాకర్ మాట్లాడుతూ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సందర్శించి తమ బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. చిన్నారులకు నీతి కథలు చెప్పారు. చిన్నారులు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే ఆటలు, మెదడుకు పదును పెట్టే ఆటలు ఆడారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, పరశురాముడు, వడ్లపట్ల ప్రభాకరరావు, ఈశ్వరమ్మ, గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం


వలంటీర్లను అభినందిస్తున్న సీఐ రవికుమార్, ఎస్సై సుధాకర్

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుసేవా దృక్పథంతో చేసిన సేవలు అభినందనీయమని సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం సాధారణ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా పోలీసులతో కలిసి విధులను నిర్వహించిన భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను క్యూలైన్లలో నిలబెట్టడం, వారి పీఎస్‌లను తెలియజేయడం, శాంతిభద్రతలకు సమస్య ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి సేవలను వలంటీర్లు అందించారని కొనియాడారు. మండల వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులకు వలంటీర్లు సహకరించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువలను గుర్తించి ఓటర్లు పెద్దఎత్తున ఉదయం నుంచి రాత్రి వరకు ఉంచి ఓట్లు వేయడం స్ఫూర్తిదాయకమన్నారు. మండలంలోని 14 మంది వలంటీర్లు భీమడోలు, గుండుగొలను, పూళ్లలతో పాటు పలు గ్రామాల్లో వారి సేవలందించారని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వారికి ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యం


గుండుగొలను : సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి జాహ్నవి


గుండుగొలనులో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు, సిబ్బంది

భీమడోలు: ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చునని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆర్ జాహ్నవి అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని డెంగీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి జాహ్నవి మాట్లాడుతూ ప్రాణాంతకమైన డెంగీ నివారణలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని కోరారు. ప్రతి శుక్రవారం ఇంటి లోపల, బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారం దాటిన నీటి నిల్వలను వెంటనే తొలగించుకోవాలన్నారు. డెంగీపై సామాజిక చైతన్యం పెంపొందించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. పరిసరాలను శుభ్రం చేసుకోవడం వల్ల కీటక జనిత వ్యాధులను నియంత్రించవచ్చునని చెప్పారు. అనంతరం గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులను చేతబట్టి నినాదాలు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు సమష్టి కృషి


గణపవరంలో డెంగీ అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ప్రాణాంతకమైన డెంగీ నివారణకు ప్రభుత్వంతో పాటు ప్రజలు సమష్టి కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో డెంగీపై అవగాహన ప్రదర్శన చేశారు. డెంగీకి కారణం దోమలేనని, దోమల నివారణతో ఈ వ్యాధిని దరిచేరకుండా చేయవచ్చని సంతోష్ అన్నారు. దోమతెరల వాడాలని, ఇళ్ల సమీపంలో మురుగునీటి నిల్వ, పాతసామాన్లు, కొబ్బరి బొండాలు, పాతటైర్లు వంటివి లేకుండా చేయాలని సూచించారు. పిప్పరలో వైద్యాధికారిణి కె.ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. కాశిపాడులో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడుతూ డెంగీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందని హెచ్చరించారు. సీహెచ్‌ఓ జాలాది విల్సన్ పాల్గొన్నారు.

నేటినుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షిక వేడుకలు

టి.నరసాపురం: ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు టి.నరసాపురంలో శ్రీగోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రథమ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు లక్కోజు నాగేశ్వరరావు, కొక్కొళ్ల శ్రీనివాసాచార్యులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభించి 6 గంటలకు గంగ పూజ, గోపూజ, విఘ్నేశ్వర పూజతో పాటు స్వామి, అమ్మవార్ల మూలమూర్తులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే 18వ తేదీన సుప్రభాత సేవ, స్వామి, అమ్మవార్లకు నవరసాభిషేకం, పంచామృతాభిషేకాలు, 108 కలశాలతో విశేష పూజలు నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 19వ తేదీన ప్రత్యేక పూజలతో పాటు అఖండ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరలించాలని కోరారు.

కాలుష్య నివారణపై స్పెషల్ ఫోకస్

- ఏలూరులో కొత్తగా 3 వాటర్ ఫౌంటేన్స్
- రూ.90 లక్షలతో నిర్మాణ పనులు
- జూన్ 10 అనంతరం ప్రారంభానికి చర్యలు
- ఏలూరు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో వాతావరణ కాలుష్య నివారణపై నగరపాలక అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (స్వచ్ఛగాలి)లో భాగంగా ఏలూరు నగరంలో వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారు. ఏలూరులో ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందేలా చేయటంతో పాటు వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేలా చర్యలు చేపట్టారు. నగరంలోని అత్యంత రద్దీ కూడళ్లలో వాటర్ ఫౌంటేన్లను ఏర్పాటు చేయటం ద్వారా గాలిని శుద్ధిచేసే అవకాశం ఉందన్న నిపుణుల సూచనల మేరకు మూడుచోట్ల వాటర్ ఫౌంటేన్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారుగా రూ.90 లక్షల నిధులు వీటి కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది.

ఆరోగ్యం.. ఆహ్లాదం

ఏలూరు నగరంలో వాయు కాలుష్య నివారణకు ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక శ్రద్ధతో వాటర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ పర్యవేక్షణలో ఇంజినీరింగ్ అధికారులు ఫౌంటేన్ల నిర్మాణ పనులు చేపట్టారు. వాటర్ ఫౌంటెన్ల కారణంగా ఆయా ప్రాంతాల్లో వాహనాల నుంచి వచ్చే విష వాయువులు, దుమ్ము, ధూళిని నియంత్రించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గాలిలోని సల్ఫర్, కార్బన్ డయాక్సైడ్, దుమ్మును వాటర్ ఫౌంటెన్‌లో నీరు ఎగిసిపడుతూ కాలుష్యాన్ని నివారిస్తుందని అంటున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులకు ఆహ్లాదంతోపాటు, ఆరోగ్య పరిరక్షణకు ఇదోక మార్గంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


వాటర్ ఫౌంటెన్, సుందరీకరణపై సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, చిత్రంలో కమిషనర్ వెంకటకృష్ణ (ఫైల్)


జూట్‌మిల్లు సెంటర్‌లో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు పనులు


తంగెళ్లమూడి సెంటర్‌లో వాటర్ ఫౌంటేన్ నిర్మాణ పనులు

రూ.90 లక్షలతో నిర్మాణం

ఏలూరు నగరంలో జూట్‌మిల్లు సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్ నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇదే ప్రాంతంలో తెలుగుతల్లి విగ్రహంతోపాటు, మహిళ నమస్కారం చేస్తూ ఉండే బొమ్మను ఏర్పాటు చేస్తున్నారు. అశోక్‌నగర్ బ్రిడ్జి సెంటర్‌లోనూ వాటర్ ఫౌంటెన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇదే తరహాలో తంగెళ్లమూడి బ్రిడ్జి ప్రాంతంలోనూ వాటర్ ఫౌంటెన్ నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మూడు ప్రాంతాల్లోనూ మూడు వాటర్ ఫౌంటెన్లను రూ.90 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే ఏలూరు జెడ్పీ కార్యాలయం సెంటర్ ప్రాంతంలో ఐ లవ్ ఏలూరు పేరుతో వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా



ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో ప్రజలకు వాయు కాలుష్యంతో ఆరోగ్య సంబంధమైన సమస్యలు ఏర్పడకుండా కాలుష్య నివారణకు నేషనల్ గ్రీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. జూన్ 10వ తేదీ అనంతరం ఈ వాటర్ ఫౌంటెన్లు, నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

105 సంఘాల ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతి


కరపత్రం విడుదల చేసిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న కందుకూరి వీరేశలింగం 105వ వర్ధంతి కార్యక్రమాన్ని 105 సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. కందుకూరి వర్ధంతి సమాలోచన కార్యక్రమాన్ని స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వీజీఎంఆర్ కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సమాలోచన సదస్సు పుస్తకావిష్కరణ, పుస్తక ప్రదర్శనలు, చాట్స్ ఎడ్యుకేషన్‌తో కందుకూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అతిథులుగా సర్ సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్, డిగ్రీకళాశాల కరస్పాండెంట్ కేవీ విష్ణుమోహన్ హాజరవుతారని తెలిపారు. కందుకూరి జీవితంపై డాక్టర్ కె.అరుణ, కె.ఇమ్మానియేలు, లంకా వెంకటేశ్వర్లు, వర ప్రసాద్, సంకు మనోరమ మాట్లాడతారని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక, ప్రజాశక్తి బుక్ హౌస్ ముద్రించిన సాహిత్య ప్రదర్శన, కందుకూరి జీవితంపై ఫొటో ఛార్ట్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మానవత జిల్లా విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావులు మాట్లాడారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం


వంక బొత్తప్పగూడెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గిరిజన గ్రామమైన వంక బొత్తప్పగూడెంలో గురువారం సికిల్‌సెల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో నలభై సంవత్సరాలలోపు వయసున్న గిరిజనులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామ ప్రజలకు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. రక్తనాళాల సంఖ్య తగ్గడం, తద్వారా రక్తహీనతకు గురవడం, ఎర్ర రక్తకణాలు రెండు రోజులకు మించి బ్రతకవని, సాధారణ వ్యక్తుల్లో ఎర్ర రక్తకణాలు నూట ఇరవైరోజులు వరకూ ఉంటాయన్నారు. సికిల్ సెల్ ఎనీమియా రోగిలో రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారడం వలన రక్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని, గుండెకు ఆక్సిజన్ సరఫరా సరిగా అందకపోవడం వలన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసటగా ఉండటం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని, జన్యుపరంగా సంక్రమించే వ్యాధి అని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సుబ్రహ్మణ్యం తెలిపారు. సూపర్‌వైజర్ చాన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్బారావు, ఏఎన్‌ఎం పి.జయప్రద, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.విమల, ఆశ వర్కర్ వి.కుమారి పాల్గొన్నారు.